తెలంగాణ స్వరాష్ట్ర సమరయోధ పత్రిక
# జనంసాక్షి
www.janamsakshi.org
హైదరాబాద్ - రంగారెడ్డి
మేడ్చల్ మల్కాజిగిరి వికారాబాద్
సోమవారం
16 ఫిబ్రవరి 2026
Follow :



## ఘనంగా కీసరగుట్ట మహాశివరాత్రి జాతర

- మంత్రులు దుద్దిళ్ల శ్రీధర్ బాబు, కోమటిరెడ్డి వెంకటరెడ్డి, హర్యానా గవర్నర్ దత్తాత్రేయ దర్శనం
- భక్తిశ్రద్ధల మధ్య స్వామివారి కల్యాణం, అభిషేకాలు.. ప్రత్యేక ఏర్పాట్లు

మేడ్చల్ జిల్లా ప్రతినిధి, ఫిబ్రవరి 15 (జనంసాక్షి): మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని కీసరగుట్ట శ్రీ రామలింగేశ్వర స్వామి ఆలయంలో జరిగిన వేడుకలు అత్యంత వైభవంగా, భక్తిశ్రద్ధల మధ్య ఘనంగా నిర్వహించబడ్డాయి. లక్షలాది మంది భక్తులు కీసరగుట్టకు తరలివచ్చి స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. శివనామ స్మరణలతో ఆలయ పరిసరాలు మారుమోగాయి. ఫిబ్రవరి 14న రాష్ట్ర ఐటీ శాఖ మంత్రి, జిల్లా ఇంచార్జి మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు రాష్ట్ర ప్రభుత్వ తరఫున స్వామివారికి పట్టువస్త్రాలు, తలంబ్రాలు సమర్పించారు. ఆలయ అర్చకులు మంత్రివర్యులకు ఘన స్వాగతం పలికారు. అనంతరం మంత్రి దంపతులు స్వామివారి కల్యాణ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఫిబ్రవరి 15న మహాశివరాత్రి పర్వదినం సందర్భంగా రాష్ట్ర రోడ్లు భవనాలు, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి, హర్యానా గవర్నర్ బండారు దత్తాత్రేయ స్వామివారిని దర్శించుకున్నారు. ఆలయ చైర్మన్, అర్చకులు వారికి పూర్ణకుంభ స్వాగతం పలికారు. ఈ సందర్భంగా పలువురు సీనియర్ న్యాయమూర్తులు కూడా కీసరగుట్టకు విచ్చేసి స్వామివారిని దర్శించుకున్నారు. మహాశివరాత్రి సందర్భంగా భారీ సంఖ్యలో భక్తులు తరలివచ్చి ఆలయ పరిసర ప్రాంతాల్లోని శివలింగాలకు స్వయంగా అభిషేకాలు నిర్వహించారు. భక్తుల రద్దీని దృష్టిలో ఉంచుకుని అధికారులు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు.

తాగునీరు, క్యూలైన్లు, భద్రతా ఏర్పాట్లు కల్పించి భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చర్యలు తీసుకున్నారు. ఈ మహాశివరాత్రి వేడుకలు కీసరగుట్టలో అత్యంత భక్తి వైభవాలతో విజయవంతంగా నిర్వహించబడినట్లు అధికారులు తెలిపారు. భక్తులు స్వామివారి దర్శనంతో ఆధ్యాత్మిక ఆనందాన్ని పొందారు.



## స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్‌ను కలిసిన మేడిపల్లి వెంకటయ్య

- గడ్డం అనన్యకు మున్సిపల్ చైర్‌పర్సన్ బాధ్యతలు కోరిక
- చిటిగిద్ద నుంచి వట్టిమినపల్లి వరకు రోడ్డు, సీసీ రోడ్లు, డ్రైనేజీ, మంచినీరు, వీధి దీపాలకు హామీ
- స్పీకర్ సానుకూల స్పందన.. సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని హామీ

**నవాబుపేట్, ఫిబ్రవరి 15 (జనంసాక్షి):** మున్సిపల్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ సాధించిన విజయం సందర్భంగా ఆదివారం వికారాబాద్ ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో తెలంగాణ అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు నవాబుపేట్ మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు మేడిపల్లి వెంకటయ్య.
ఈ సందర్భంగా మండల అధ్యక్షుడు ప్రభాకర్ రెడ్డి, పులుమామిడి గ్రామ సర్పంచి దాన నరసింహులు, మీరజ్, అమీర్ ఖాన్ తదితరులు కూడా ఉన్నారు. మేడిపల్లి వెంకటయ్య మాట్లాడుతూ.. మున్సిపల్ ఎన్నికల్లో 17వ వార్డు కౌన్సిలర్‌గా గడ్డం అనన్య గెలుపొందిన సందర్భంగా ఆమెకు మున్సిపల్ చైర్‌పర్సన్ బాధ్యతలు అప్పగించాలని స్పీకర్‌ను కోరారు. ఈ కోరిక మేరకు తప్పకుండా నైవేద్య విధంగా చేస్తామని స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ హామీ ఇచ్చారు. స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ సానుకూలంగా స్పందిస్తూ.. చిటిగిద్ద పెట్రోల్ బంక్ నుంచి పట్టిమేనపల్లి గ్రామం వరకు బీటి రోడ్డు వేస్తామని, సమస్యలను సంవత్సరంలోపు పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. మండల అభివృద్ధికి ప్రత్యేక దృష్టి పెడతామని భరోసా ఇచ్చారు. ఈ సమావేశంలో నవాబుపేట్ మండల కాంగ్రెస్ నాయకులు స్పీకర్‌కు సమస్యలను వివరించి, త్వరగా పరిష్కారం చేపట్టాలని కోరడం జరిగింది. స్పీకర్ హామీలతో మండల ప్రజల్లో ఆశాభావం నెలకొంది.





## అంగరంగ వైభవంగా శ్రీ మల్లికార్జున స్వామి కళ్యాణం

- ఆలయ అభివృద్ధికి పర్యాటక శాఖ నుంచి మంజూరైన 2కోట్ల నిధుల చెక్కును అందించిన ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి

**తలకొండపల్లి ఫిబ్రవరి15(జనంసాక్షి):**
తలకొండపల్లి మండలంలోని చెన్నారం గ్రామపంచాయతీ శివారులో ఎత్తైన కొండలపై స్వయంభుగా వెలసిన శ్రీ మల్లికార్జున స్వామి బ్రహ్మోత్సవాలు అంగరంగ వైభవంగా కొనసాగుతున్నాయి.స్వామివారి బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఆదివారం నిర్వహించిన శ్రీ భ్రమరాంబ మల్లికార్జున స్వామి కళ్యాణ మహోత్సవానికి కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి దంపతులు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. స్వామివారి కల్యాణానికి దేవత విగ్రహమూర్తులను శోభయ మానంగా అలంకరించి భాజా భజంత్రీల మధ్యన వేద పండితులుగోపాల శర్మ,అక్షిత్ శర్మ,విశ్వేశ్వర్ శర్మ,లు స్వామివారి కల్యాణాన్ని అంగరంగ వైభవంగా నిర్వహించారు.ఈ కళ్యాణ మహోత్సవంలో ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి-మాధవి,ఏమిరెడ్డి ప్రియాంక-పాండురంగా రెడ్డి దంపతులు కూర్చొని శ్రీ బ్రమరాంబ మల్లికార్జున స్వామివారి కల్యాణాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహించారు.అనంతరం ఎమ్మెల్యే దంపతులు స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..ఎత్తైన కొండలపై వెలిసిన మల్లప్ప గుట్ట మల్లికార్జున స్వామి దేవాలయం భక్తుల కొంగుబంగారంగా నిలవాలని కోరుకున్నారు.రాష్ట్ర ప్రభుత్వం పర్యటక శాఖ ద్వారా ఆలయ అభివృద్ధి కొరకు మంజూరైన 2 కోట్ల నిధుల చెక్కును ఆలయ కమిటీ నిర్వాహకులకు అందించారు.రాష్ట్ర ప్రభుత్వ సహకారంతో మరిన్ని నిధులు మంజూరుకు కృషి చేసి ఆలయ అభివృద్ధికి సహకరిస్తామన్నారు. అదేవిధంగా కళ్యాణోత్సవ సందర్భంగా దేవాలయ ప్రాంగణంలో వందల మంది భక్తులు సత్యనారాయణ స్వామి వ్రతాలను నిర్వహించారు.కళ్యాణానికి వచ్చిన భక్తులకు అన్నదాన వితరణ చేశారు.అంతకముందు తలకొండపల్లి మండలం పడకల్ గ్రామానికి చెందిన మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు డోకూరు ప్రభాకర్ రెడ్డి-సునీత దంపతులు ఆలయ అభివృద్ధికి తమ వంతు సహకారంగా రూ,50 వేలను విరాళంగా ఆలయ కమిటీకి అందించారు.ద

ఈ కార్యక్రమంలో ఐక్యత ఫౌండేషన్ చైర్మన్ సుంకిరెడ్డి రాఘవేందర్ రెడ్డి,ఆలయ కమిటీ గౌరవ అధ్యక్షులు ఎమిరెడ్డి పాండురంగారెడ్డి,చెన్నారం సర్పంచ్ రాత్లావత్ రజిత రాజు నాయక్, ఆలయ ముఖ్య కార్యనిర్వహకులు శేఖర్ రెడ్డి,పెంటారెడ్డి,మల్లారెడ్డి,నాయకులు ఏమిరెడ్డి రంగారెడ్డి,మాజీ ఎంపీపీ లక్ష్మీదేవి రఘురాములు,భాస్కర్ రెడ్డి, యాదయ్య, రేణు రెడ్డి, రాజేందర్ నాయక్, రమేష్ నాయక్, మాల్యా నాయక్, చంద్రకుమార్, ఆయా గ్రామాల ప్రజా ప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు, భక్తులు, తదితరులు పాల్గొన్నారు.

## మహాశివరాత్రి పర్వదినం సందర్భంగా పలు శివాలయాల్లో పూజల్లో పాల్గొన్న పరమేశ్వర్ రెడ్డి



**ఉప్పల్ ఫిబ్రవరి 15 (జనంసాక్షి):** మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని ప్రాంతంలోని పలు శివాలయాల్లో జరిగిన ప్రత్యేక పూజా కార్యక్రమాల్లో పరమేశ్వర్ రెడ్డి భక్తిశ్రద్ధలతో పాల్గొన్నారు. తెల్లవారుజామునే ఆలయాలకు చేరుకున్న ఆయన, అభిషేకాలు, అర్చనలు, రుద్రపారాయణ కార్యక్రమాల్లో పాల్గొని భగవంతుని ఆశీస్సులు పొందారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకులు వేదమంత్రాల నడుమ ప్రత్యేక పూజలు నిర్వహించగా, పరమేశ్వర్ రెడ్డి కుటుంబ సమేతంగా శివలింగానికి పాలు, పెరుగు, తేనె, చక్కెర తదితర ద్రవ్యాలతో అభిషేకం చేశారు. అనంతరం భక్తులకు ప్రసాదం పంపిణీ చేసి, శివరాత్రి శుభాకాంక్షలు తెలిపారు. శివరాత్రి పర్వదినం ఆధ్యాత్మికత, నియమ నిష్ఠలకు ప్రతీక అని పేర్కొన్న ఆయన, సమాజంలో శాంతి, సౌహార్దం నెలకొనాలని కోరుకున్నారు. యువత ధార్మిక విలువలను ఆచరించాలని, సంస్కృతి పరిరక్షణలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. పలు దేవాలయాల్లో భక్తులతో కలిసి జాగరణ కార్యక్రమాల్లో కూడా ఆయన పాల్గొన్నారు. శివనామస్మరణతో మారుమోగిన ఆలయ ప్రాంగణాల్లో భక్తుల సందడి కనిపించింది. మహిళలు, యువకులు పెద్ద సంఖ్యలో పాల్గొని ప్రత్యేక దీపారాధనలు నిర్వహించారు. ఈ కార్యక్రమాల్లో స్థానిక ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. మహాశివరాత్రి సందర్భంగా ఆలయాలు విద్యుద్దీపాలతో అలంకరించబడి భక్తులతో కళకళలాడాయి.

## శ్రీ సేవాలాల్ మహారాజ్ 287వ జయంతి ఉత్సవాలలో పాల్గొన్న మందముల పరమేశ్వర్ రెడ్డి



**ఉప్పల్ ఫిబ్రవరి 15 (జనంసాక్షి):** ఉప్పల్ నియోజకవర్గం హబ్సిగూడ డివిజన్ పరిధిలోని వెలుగుట్టలో శ్రీ సేవాలాల్ మహారాజ్ గారి 287వ జయంతి ఉత్సవాలు ఘనంగా నిర్వహించబడ్డాయి. వెలుగుట్ట సేవాలాల్ కమిటీ ఆధ్వర్యంలో ఆదివారం ఉదయం జరిగిన ఈ వేడుకలకు ఉప్పల్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జ్ మందముల పరమేశ్వర్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా పరమేశ్వర్ రెడ్డి గారు శ్రీ సేవాలాల్ మహారాజ్ గారి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ, సేవాలాల్ మహారాజ్ సమాజానికి చేసిన సేవలు, బంజారా సమాజానికి అందించిన మార్గదర్శకత్వం చిరస్మరణీయమని కొనియాడారు. యువత ఆయన ఆశయాలను ఆదర్శంగా తీసుకుని సమాజ అభివృద్ధికి కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో డివిజన్ అధ్యక్షులు విజయ్ కుమార్, కంది శ్రావణ్ రెడ్డి, బాబు రావు, రాజన్న, దేవి రెడ్డి, హబ్సిగూడ సేవాలాల్ కమిటీ సభ్యులు గణేష్ నాయక్, కిషన్ నాయక్, రాజు నాయక్, ధర్మేందర్ నాయక్, వాసు నాయక్, లింగ నాయక్, మల్లు నాయక్, సురేష్ నాయక్, దినేష్ నాయక్, సుమన్ నాయక్, గోవర్ధన్ నాయక్, బాలు నాయక్ పాల్గొన్నారు.

## జైడస్ పింకథాన్ రన్‌లో పాల్గొన్న 5 వేల మంది మహిళలు

**ఖైరతాబాద్, (జనంసాక్షి) :** తెలంగాణ ప్రభుత్వం మద్దతు, ఫిట్ ఇండియా, స్పోర్ట్స్ అథా రిటీ ఆఫ్ ఇండియా సహకారంతో జైడస్ పింకథాన్ హైదరాబాద్ ఆరో ఎడిషన్ ఆదివారం ఉదయం నెక్లెస్ రోడ్‌లోని పీపుల్స్ ప్లాజాలో 5 వేల మంది మహిళలతో అత్యంత ఉత్సాహంగా జరిగిందని పింకథాన్ వ్యవస్థాపకుడు మిలింద్ సోమన్ తెలి పారు. 3 కి.మీ విభాగంలో అమల కలపాల, 5 కి.మీ విభాగంలో మౌనిక కలపాల, 10 కి.మీ. పరుగులో వద్దే నవ్య విజేతలుగా నిలిచారని చెప్పారు. అల్ట్రా రన్నింగ్ విభాగంలోనూ మహిళలు తమ సత్తా చాటరని తెలిపారు. లోటస్ హెర్బల్స్, లైఫ్ లాంగ్, సిరోనా, పార్క్ హయత్, ఫ్యుజిఫిల్మ్, బిస్లరీ వంటి సంస్థలు భాగస్వాములుగా నిలిచిన ఈ రన్ లో ఇన్విన్సిబుల్ ఉమెన్ ఫౌండర్ అంకిత కొన్వర్, జైడస్ లైఫ్‌సైన్సెస్ బియు బయోలాజిక్స్ ప్రెసిడెంట్ డాక్టర్ కేయూర్ పరేఖ్ పాల్గొన్నారు. తదుపరి పరు గును మార్చి 8న ఢిల్లీలో, ఏప్రిల్ 5న పూణేలో నిర్వహించనున్నట్లు తెలిపారు.

# ఆదర్శ కమ్యూనిస్టు యోధుడు బొమ్మగాని ధర్మబిక్షం

**అబ్దుల్లాపూర్ మెట్టు, ఫిబ్రవరి 15 (జనంసాక్షి):** తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట యోధుడు, మాజీ నల్లగొండ పార్లమెంట్ సభ్యుడు కామ్రేడ్ బొమ్మగాని ధర్మబిక్షం జీవితం నేటి సమాజానికి ఆదర్శప్రాయమని గీతకార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షులు, భారత కమ్యూనిస్టు పార్టీ (సిపిఐ) రాష్ట్ర కార్యవర్గ సభ్యులు బొమ్మగాని ప్రభాకర్ పేర్కొన్నారు. ధర్మబిక్షం జయంతి సందర్భంగా ఆదివారం సిపిఐ అబ్దుల్లాపూర్ మెట్టు మండల సమితి ఆధ్వర్యంలో మండల ప్రధాన కార్యదర్శి అజ్మీరా హరిసింగ్ నాయక్ అధ్యక్షతన మండల కేంద్రంలోని ధర్మబిక్షం విగ్రహం వద్ద ఘనంగా నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ధర్మబిక్షం కుమారుడు బొమ్మగాని ప్రభాకర్ హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, తెలంగాణ సాయుధ పోరాట సమయంలో నల్లగొండ జిల్లా రాచకొండ ప్రాంతంలో వేల ఎకరాల భూములను పేదలకు పంచిన గొప్ప యోధుడు ధర్మబిక్షం అని కొనియాడారు. సూర్యాపేట, నకిరేకల్, నల్లగొండ నియోజకవర్గాల నుంచి వరుసగా మూడు సార్లు శాసనసభకు ఎన్నికై విశిష్ట సేవలు అందించారని తెలిపారు. నల్లగొండ జిల్లాను ఫ్లోరైడ్ సమస్య తీవ్రంగా



ప్రభావితం చేస్తున్న సమయంలో 1996లో జరిగిన 11వ లోక్‌సభ ఎన్నికల్లో 480 మంది ఫ్లోరైడ్ బాధితులు పోటీ చేసినప్పటికీ, ధర్మబిక్షం 76 వేల మెజార్టీతో విజయం సాధించి సంచలనం సృష్టించారని గుర్తు చేశారు. సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఆందోజు రవీంద్ర చారి, రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు ముత్యాల యాదిరెడ్డి మాట్లాడుతూ గీతాపనివారి సంఘాలను ఏర్పాటు చేసి గౌడ కులస్థుల హక్కుల కోసం జీవితాంతం కృషి చేసిన నాయకుడు ధర్మబిక్షం ని అన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కూడా ఇటీవల పలు సభల్లో ధర్మబిక్షం సేవలను ప్రస్తావిస్తున్నారని పేర్కొన్నారు. రాష్ట్రంలో ధర్మబిక్షం కి సముచిత స్థానం కల్పించాలని, అబ్దుల్లాపూర్ మెట్టు ప్రాంతంలో ఆయన పేరుమీద ఆడిటోరియం నిర్మించాలని, అది పరిసర ప్రాంత ప్రజలకు ఉపయోగపడేలా ఉండాలని వారు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో అబ్దుల్లాపూర్ గ్రామ సర్పంచ్ విజయ శ్రీశైలం గౌడ్, మాజీ జడ్పీటీసీ బింగి దాస్, సిపిఐ రంగారెడ్డి జిల్లా కార్యవర్గ సభ్యులు పబ్బతి లక్ష్మణ్, మండల సహాయ కార్యదర్శి కేతారాజు నర్సింహా, బిఓసి జిల్లా కార్యదర్శి దాసరి ప్రసాద్, శాఖ కార్యదర్శి రమేష్ నాయక్, సిపిఐ మండల కార్యవర్గ సభ్యులు, మహిళా నాయకులు పాల్గొన్నారు.

# దారులన్నీ భూకైలాస్ వైపే

- ఆలయ ప్రాంగణం భక్తులతో అలరారు
- శివనామ స్మరణతో మారుమోగిన భూకైలాస్
- ప్రత్యేక ఏర్పాట్లు చేసిన వ్యవస్థాపకులు వాసు పవర్ నాయక్





**తాండూరు ఫిబ్రవరి 15 (జనంసాక్షి):** తాండూర్ మండలం అంతారం గ్రామ సమీపంలోని భూకైలాస్ ద్వాదశ జ్యోతిర్లింగాల దేవస్థానంలో మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని ఆలయ ప్రాంగణం భక్తులతో కిటకిటలాడింది. తాండూర్ నియోజకవర్గంతో పాటు వివిధ మండలాలు మరియు కర్ణాటక, మహారాష్ట్ర నుండి భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని పరమేశ్వరుని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అదేవిధంగా పట్టణ ప్రముఖులు ఆలయాన్ని సందర్శించి స్వామి వారిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకులు వేదమంత్రాలు పటిస్తూ తీర్థప్రసాదాలు అందజేశారు. భూమిలో స్వర్గధామంగా వెలసిన భూకైలాస్ లో 65 అడుగుల శివుని విగ్రహం భక్తులను కనువిందు చేసింది. అదే విధంగా వివిధ దేవత విగ్రహ మూర్తులను దర్శించుకుని భక్తులు తనివి తీరారు. నీటిలో వెళుతూ ద్వాదశ జ్యోతిర్లింగాలను దర్శించుకుంటూ వెళ్తూ శివనామస్మరణ పటిస్తూ భక్తులు మైమరిచిపోయారు. దీంతో ఆలయం శివనామ స్మరణతో మారుమరోగింది. భూకైలాస్ వ్యవస్థాపకులు వాసు పవర్ నాయక్ భక్తుల దర్శనార్థం ప్రత్యేక ఏర్పాటు చేసి దర్శన భాగ్యం కల్పించారు.

# నందివనపర్తిలో ఘనంగా మహాశివరాత్రి ఉత్సవాలు





**యాచారం, (జనంసాక్షి):** మహాశివరాత్రి పర్వదినం పురస్కరించుకొని యాచారం మండల పరిధిలోని 24 గ్రామపంచాయతీలలో ఆయా గ్రామాలలో గల శివాలయాలు రామాలయాలు వివిధ ఆలయాలలో పెద్ద ఎత్తున ప్రత్యేక పూజలు నిర్వహించి భక్తులు ఉపవాసాలను ముగించారు. యాచారం సీఐ నందీశ్వర్ రెడ్డి ఆధ్వర్యంలో ఆలయాలలో శాంతి మొదట అంశాలను క్షుణ్ణంగా పరిశీలించి పరిస్థితులకు అనుగుణంగా ఏర్పాట్లు చేయించారు,మరింత కట్టుదిట్టంగా చేయాలని నిర్వాహకులకు సూచన చేశారు. యాచారం మండల పరిధిలోని నందివనపర్తి గ్రామంలోని ఓంకారేశ్వరాలయం నందీశ్వరాల యం సిద్దేశ్వరాలయంలో భక్తులు ఉదయం నుండి సాయంత్రం వరకు ఆలయంలో స్వామి వారి దర్శించుకుంటూ ప్రత్యేక పూజలు నిర్వహించారు. సిద్దేశ్వర ఆలయంలో సామూహిక సత్యనారాయణ వ్రతాలు చేసి భక్తులు భక్తి చాటుకున్నారు. నందీశ్వరాలయం సిద్దేశ్వరాలయంలో తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ కమిషన్ చైర్మన్ ముదిరెడ్డి కోదండ రెడ్డి దంపతులు ప్రత్యేక పూజలు నిర్వహించి ఆలయంలో మొక్కు తీర్చుకున్నారు. నందీశ్వరాలయంలో ఉదయం నుండి సాయంత్రం వరకు ఏకధాటిగా భక్తులు రద్దీలో సేవకులు క్రమశిక్షణతో దర్శనానికి ఏర్పాటు చేసి వసతులు కల్పించారు. సిద్దేశ్వరాలయంలో సాయంత్రం భక్తులకు ఉపవాసం అనంతరం సంస్కృత కార్యక్రమాలు ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో రాచర్ల వెంకటేశ్వర్లు, బిలకంటి చంద్రశేఖర్ రెడ్డి, కొంగళ్ల జోగిరెడ్డి, కంబాలపల్లి మల్లారెడ్డి, తేల్గమల్ల రవీందర్,సంగం రాజు, మహేందర్ రెడ్డి, కాళ్ళ జంగయ్య, నక్క మహేందర్,నుకం మహేందర్ ముచర్ల వెంకటరమణ, పంది సుధాకర్, పాల్గొన్నారు.

# శివనామస్మరణతో మార్మోగిన రామలింగేశ్వర స్వామి దేవాలయం

- స్వామివారి సేవలో పాల్గొన్న ఆలయ ఈవో కృష్ణమాచారి
- స్వామివారిని దర్శించుకున్న ఏసిపి శంకర్ రెడ్డి
- భక్తులకు సౌకర్యాలు కల్పించిన ఆలయ చైర్మన్ రాధాకృష్ణమూర్తి



**మేడ్చల్ (జనంసాక్షి) :** మేడ్చల్ పట్టణం లోని శ్రీశ్రీశ్రీ దాక్షాయిని రామలింగేశ్వర స్వామి దేవాలయంలో శివనామస్మరణతో మార్మోగింది. మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరిం చుకొని భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ ఈవో కృష్ణమాచారి మాట్లాడుతూ శివరాత్రి సంద ర్భంగా ఆలయంలో భక్తుల కొరకు కల్పించిన సౌకర్యాల పట్ల సంతృప్తిని వ్యక్తం చేశారు. అనంతరం ఆలయ చైర్మన్ రాధాకృష్ణమూర్తి మాట్లాడుతూ ఈ దేవాలయం మేడ్చల్ మండలంలోని అత్యంత పురాతనమైనదిగా పేర్కొంటూ ఈ దేవాలయ దర్శనానికి ఇతర రాష్ట్రాల నుంచి సైతం భక్తులు విచ్చేసి మొక్కులు తీర్చుకుం టార ని తెలిపారు. ఈ సందర్భంగా విచ్చేసిన భక్తులకు కనీసం ఎలా ంటి అసౌకర్యాలు కలగకుండా చర్యలు తీసుకున్నట్లు తెలిపారు.

**స్వామివారి సేవలో మేడ్చల్ ఏసీపీ శంకర్ రెడ్డి**

శివరాత్రి పర్వదినం సందర్భంగా మేడ్చల్ పట్టణంలోని పురాతనమైన శ్రీశ్రీశ్రీ రామలిం గేశ్వర స్వామి దేవాలయంలో మేడ్చల్ అసిస్టెంట్ కమిషనర్ ఆఫ్ పోలీస్ సిహెచ్



శంకర్ రెడ్డి స్వామివారి సేవలో పాల్గొని అభిషేకం, అర్చన పూజా కార్యక్రమం నిర్వ హిం చుకున్నారు. ఈ సందర్భంగా ఆలయ చైర్మన్ రాధాకృష్ణమూర్తి మేడ్చల్ ఏసీబీకి శాలువా కప్పి సన్మానించారు. ఈ కార్యక్ర మంలో శ్రీనివాస్‌చారి, దాత్రిక లక్ష్మణ్, శ్రీని వాసమూర్తి, అంకిత్, ప్రధాన ఆలయ అర్చ కులు కార్తీక్ తో పాటు బృందం పాల్గొన్నారు.

# భక్తిశ్రద్ధలతో.... పరమేశ్వరుని కొలవాలి

## శివారాధన తోనే... శీఘ్ర ఫలితాలు

## బీవీజీ ఫౌండేషన్ చైర్మన్ డాక్టర్ సంపత్ కుమార్



**తాండూరు ఫిబ్రవరి 15(జనంసాక్షి)** భక్తి శ్రద్ధలతో పరమేశ్వరుని కొలిస్తే కోరిన కోరికలు నెరవేరుతాయని బీవీజీ ఫౌండేషన్ చైర్మన్ డాక్టర్ సంపత్ కుమార్ పేర్కొన్నారు. మహాశివరాత్రి పర్వదిన సందర్భంగా పట్టణ సమీపంలోని బసవేశ్వర్ నగర్ లో కొలువైన చేరువెంటి ఈశ్వర ఆలయంలో బీవీజీ ఫౌండేషన్ చైర్మన్ డాక్టర్ సంపత్ కుమార్ ప్రత్యేక పూజలు నిర్వహించి పరమేశ్వరుని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆధ్యాత్మిక చింతన తోనే మాన సిక ప్రశాంతత లభిస్తుందని తెలిపారు. నియమనిష్టలతో శివనామ పంచాక్షరి పాఠిం చాలన్నారు.శివారాధన తోనే... శీఘ్ర ఫలితాలు లభిస్తాయని వెల్లడించారు .అనంతరం ఆల య అర్చకులు వేదమంత్రాలు పఠిస్తూ తీర్థప్రసాదాలు అందజేశారు. ఈ ఆధ్యాత్మిక కార్యక్రమంలో యువనాయకులు దొరశెట్టి సత్యమూర్తి, భరత్ రెడ్డి, ఉన్నారు.

# ఘనంగా సంత్ సేవాలాల్ మహారాజ్ 287వ జయంతి వేడుకలు



**కాప్రా, ఫిబ్రవరి 15 (జనంసాక్షి) :** కుషాయిగూడ డివిజన్లోని కృష్ణా రెడ్డి నగర్ బంజారా కాలనీలో బంజారా వెల్ఫేర్ యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో సంత్ సేవాలాల్ మహారాజ్ గారి 287వ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ ఉత్సవాలకు మేడ్చల్–మల్కాజిగిరి జిల్లా వ్యవసాయ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ విఠల్ నాయక్ ముఖ్య అతిథులుగా హాజరై, శ్రీ సంత్ సేవాలాల్ మహారాజ్ విగ్రహానికి పూలమాలలు వేశారు. ఈ సందర్భంగా విఠల్ నాయక్ మాట్లాడుతూ బంజారా సమాజ అభ్యున్నతికి ఆయన చేసిన సేవల ను స్మరించుకున్నారు. బంజారా వంశంలో ధైర్యం, సాహసం కలిగిం చి, ఆధ్యాత్మిక కిరణాలు ప్రసరింప చేయడానికి జన్మించిన మహనీ యుడు సంత్ సేవాలాల్.1739లో రాయలు ఏలిన రాయల సీమలో గుత్తి లో అవతరించిన వర ప్రసాదం సేవాలాల్ సప్త మాతృకల ఆశీస్సులతో దివ్య తేజమై వెలిగిన శక్తి పుంజం సంత్ సేవాలాల్ ని పేర్కొన్నారు. శ్రీ సంత్ సేవాలాల్ ఏక్ జాత్, ఏక్ వాత్, ఏక్ సాత్ అనే ఆలోచన తో ప్రజలను ఏకం చేశారన్నారు. విద్య, ఉద్యోగ, సామాజిక, ఆర్థిక రంగాల్లో అభివృద్ధి సాధించాలని, పూర్వీకులు అందించిన విలువలు, సంప్రదాయం మరిచిపోవద్దని చాటిన మహాత్ముడన్నారు. 12 ఏళ్ల వయస్సులో భృగరాజు గురువు సమక్షంలోదీక్ష పొంది, జంతుబలులను నిరసించి, అమ్మవారికి పొంగలిని నైవేద్యం పెట్టి, భక్తి సాగరంలో మునిగాడు. తినడానికి తిండి లేకున్నా ధర్మాన్ని వదలక, సట్టీ పూజ, హోలీ సంప్రదాయ పండుగలతో ప్రజల్లో ధార్మిక భావన పెంచి,భక్తి మార్గంలో నడవాలని ప్రజలకు బోధించాడన్నారు. ఆధ్యాత్మిక చైతన్యంతో నిండి , విలువలు విద్యను ఆర్జించి, నాగరికతతో జీవిస్తూ , ఇతర మతాల్లోకి చేరకుండా, తన ధర్మాన్ని కాపాడుకోవటం అనే సూత్రాలతో ఉద్యమించిన సంత్ సేవాలాల్ మహారాష్ట్ర లో సమాధి పొంది, సేవా నిరతి ని, ఆధ్యాత్మిక చింతనను, భగవత్ తత్వాన్ని పంచిన ఈయన, అందరికి మార్గదర్శకుడన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్సై సాయిలు , కానిస్టేబుల్ జైపాల్, సీనియర్ కాంగ్రెస్ నాయకులు శ్రీ టిల్లు యాదవ్, మూర్తుజా, ప్రకాష్ రెడ్డి, జై, హీరాలాల్ నాయక్ మరియు బంజారా వెల్ఫేర్ ఎ యూత్ నాయకులు గుగులోత్ వెంకటేష్, శేఖర్,జి శంకర్, సురేష్, వినోద్, డి మల్లేష్, జి కుమార్, పి ప్రశాంత్, ఎల్ రమేష్, జే. జయిల్ సింగ్, బి రాజేందర్, ఈ రాజేష్, ఈ సురేష్ తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా సంత్ సేవాలాల్ మహారాజ్ 287వ జయంతి



**బొంరాస్ పేట,దుద్యాల, ఫిబ్రవరి 15 (జనంసాక్షి):** గిరిజనుల ఆరాధ్య దైవము శ్రీశ్రీశ్రీ సంత్ సేవాలాల్ మహారాజ్ 287వ జయంతి కార్యక్రమాలను బొంరాస్ పేట, దుద్యాల మండలాల పరిధిలోని ఆయా గిరిజన తండాలలో ఘనంగా నిర్వహించారు.ఈ సందర్భంగా సేవాలాల్ మహారాజ్ మహా భోగ్ బండార్ పూజా కార్యక్రమం అంగరంగ వైభవంగా నిర్వహిం చారు.ఆయా గిరిజన తండాల్లో జరిగిన కార్యక్రమంలో సర్పంచులు,ఉప సర్పంచులు,వార్డు సభ్యులు,యువకులు, మహిళలు పాల్గొన్నారు.

# ప్రజల మహా మనిషి ధర్మ బిక్షం 104 జయంతి వేడుకలు




**శామీర్ పేట్, జనవరి 15(జనంసాక్షి):** ప్రముఖ భారతదేశ స్వాతంత్ర సమరయోధుడు, తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట యోధుడు, ఆర్య సమాజ్ సారథి, జర్నలిస్టు, కార్మిక సంఘాల నాయకుడు, హాకీ టీం కెప్టెన్, రెండు మార్లు పార్ల మెంట్ సభ్యులు, మూడుమార్లు శాసనసభ సభ్యులు, గీతా పనివారల సంఘం వ్యవస్థాపక అధ్యక్షుడు బొమ్మగాని ధర్మ బిక్షం 104వ జయంతి వేడుకలను షామీర్ పేట్ మండల కేంద్రమైన క్రాంతి భవన్ వద్ద జరుపుకున్నారు. ఈ సందర్భం గా ధర్మ బిక్షం సమాజానికి, గీతా వృత్తిదారుల సంఘానికి, దేశానికి చేసిన సేవలను గుర్తు చేసు కుంటూ ఆ మహనీయుని తలుచుకున్నారు. ఈ కార్యక్రమానికి మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా తెలంగాణ రాష్ట్ర గీత పని వార్ల సంఘం కార్యదర్శి డి.జి.నరేందర్ ప్రసాద్, డి.జి.నాగరాణి, డీ.జీ. మురళీకృష్ణ, డీ.జీ. ధర్మ రక్షక్, డి.జి.నవీన, డి.జి. మల్లికా, డీ.జీ.సృష్టికిరణం, డి.జి.సాయి గణేష్ కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

# సేవకుడే కానీ! నాయకుడు కాదు

- యువనాయకుని సేవలు గుర్తించని లక్మాపూర్ ఐదవ వార్డు ప్రజలు

**శామీర్ పేట్, జనవరి 15(జనంసాక్షి)**

మూడుచింతల పల్లి మున్సిపాలిటీ లక్మాపూర్ గ్రామములో ఐదవ వార్డు ఎన్నికలలో ప్రజలు క్యాతం కవిత మధు క్రిష్ణ ను తిరస్కరించారు. యువ నాయకుడు క్యాతం మధు క్రిష్ణ ను ఆ వార్డు ప్రజలు సేవకుని లాగే చూశారు కానీ నాయకుని లాగా చూడలేదు. మొత్తం మున్సి పాలిటీ లో అన్ని సర్వేలలో కూడా ఇక్కడ స్వతంత్ర అభ్యర్థి ఖచ్చితముగా గెలుస్తాడని అందరు భావించారు. వారి ప్రచారం కూడా అందరికంటే భిన్నముగా సాగింది. ప్రధాన పార్టీలకు దీటుగా ప్రచారం చేసారు. పోటీచేసిన నలుగురిలో ఉన్నత విద్యా వంతురాలైన కవిత మధు క్రిష్ణ ను ప్రజలు చేర దీయలేదు. యువనాయకుడు క్యాతం మధు క్రిష్ణ గత ఏడు సంవత్సరాలుగా చేసిన సేవలు కూడా డబ్బు, మద్యం, సానుభూతి ముందు పని చేయ్య లేదు.మద్యం,డబ్బులు ఏరులై పారాయి. అన్ని పార్టీలు బి-ఫారం ఇస్తామన్న మా గ్రామ ప్రజల రెవిన్యూ సమస్యను గుర్తించడం కోసం స్వతంత్ర అభ్యర్థిగా నిలబడుతున్న అన్న వార్డు ప్రజల కని కరించలేదు. యువకుడు, ఉన్నత విద్యావంతుడు అయిన క్యాతం మధు క్రిష్ణను నాయకునిగా చూడ లేదు. విలువలు లేని సమాజం కోసం ఎంత కష్ట పడ్డ వృధా ప్రయాస అని మరోసారి ఋజువు అయ్యిం ది.ఊరికి చేసిన ఉపకారం పీనుగకు చేసిన సింగారం అనే నానుడి వీరి విషయములో నిజం అయ్యింది. ప్రతి విషయములో వారితో అవసరం కానీ ఎన్నికలలో అనవసరం. చివ రికి అయన ఎంతో నమ్ముకున్న విద్యావం తులు, యువకులు, మహిళలు కూడా డబ్బు కి దాసోహం అయ్యారు. ఎన్నికలలో ఓటమి గెలుపు సహజం అయినప్పటికీ ఎక్కువ మెజా రిటీతో ఓడిపోవడం తో మేధావులు విస్మయం వ్యక్తం చేస్తున్నారు. సమాజం గురించి తన జీవితాన్ని సైతం తాకట్టు పెట్టి స్వంత డబ్బుతో ఎన్నికల బరిలో దిగిన, ప్రజలు వారి కష్టాన్ని, కుటుంబాన్ని సైతం వదిలేసి వృధా చేసిన సమయాన్ని గుర్తించలేదు. ఎవరి



కోసం ఈ పోరాటం, పార్టీలోకి పొయ్యివుంటే ఈ పరిస్థితి ఉండేది కాదు.ప్రజల కోసం ఆలోచించ కుండా ఏదో ఒక పార్టీలో కి వెళ్లి పోటీచేస్తే ఖచ్చితముగా గెలిసేవాడని అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు. గ్రామములో చాలామంది నాయకు లకు ఈయనకు పదవి దక్కడం ఇష్టము లేదు. రాజకీయాలలో నిదానముగా వుంటే నడవ దని ఇప్పటికైనా ఏదో ఒక పార్టీలో చేరితే ఆయనకు వున్న ప్రతిభకు త్వరిత గతిన మంచి స్థానాన్ని అందుకొని, అనుకున్నది సాధిస్తాడని అయన సన్నిహితులు అంటు న్నారు. ఈ ఓటమితో రాజ కీయాలకు దూరంముగా ఉంటాడో, ఏదో ఒక పార్టీలో చేరి ప్రత్యర్థులకు చుక్కలు చూపిస్తాడో వేచి చూడాల్సిందే.

# మున్సిపాలిటీ చైర్మన్ అందె మోహన్ పక్క

## అధిష్టానం దృష్టిలో అందె మోహన్

## తననే కోరుతున్న మున్సిపాలిటీ లోకల్: యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు కుమార్



**జిల్లేడు చౌదరిగూడ (జనంసాక్షి):** షాద్నగర్ మున్సిపాలిటీ చైర్మన్ అందె మోహన్ కే పక్క అంటున్న జిల్లేడు చౌదరిగూడ యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు కుమార్. సబండవర్గా నాయకునిగా ఎదుగుతున్నటువంటి యువ నాయకుడు అందే మోహన్ అధిష్టానం దృష్టిలో ఉన్నారని పేర్కొన్నారు. కాంగ్రెస్ పార్టీలో తను పడిన కష్టానికి అన్ని విధాలుగా పవనాలు కలిసి వచ్చాయని తనకే మునిసిపాలిటీ చైర్మన్ పదవి దక్కనుందని ధీమా వ్యక్తపరిచారు.

# ఆలయానికి ఖ పోటెత్తిన భక్తజనసంద్రం





- నీటిగుండం ద్వారా భక్తుల దర్శనం
- శంకర్ నాయక్, వాసు నాయక్ ఆధ్వర్యంలో బ్రహ్మోత్సవాలు

**తాండూరు ఫిబ్రవరి 15(జనంసాక్షి):** మహాశివరాత్రి పర్వదినం వేడుకలను తాండూరు ప్రజలు భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. ఆదివారం మహాశివరాత్రి సందర్భంగా శివనామస్మరణలతో శైవక్షేత్రాలు మార్మోగాయి. శివరాత్రి సందర్భంగా పట్టణంలోని భావిగి భద్రేశ్వర దేవాలయం, కోటేశ్వర దేవాలయం, అంతప్పబావి శివాలయం, చెరువెంటి ఈశ్వరాలయం తదితర శైవక్షేత్రాల్లో ప్రత్యేక పూజా కార్యక్రమాలు జరిగాయి.పండుగను పురస్కరించుకుని కుటుంబంలోని చిన్నా, పెద్ద అంతా తరలివచ్చి ఆలయాల్లో వెలసిన శివుని, శివలింగానికి, నందీశ్వరుడికి అభిషేకాలు, ప్రత్యేక పూజలు నిర్వహించారు. శివునికి ప్రీతిపాత్రమైన బిల్వపత్రాలను సమర్పించుకున్నారు. అదేవిధంగా ఆలయాల్లోని శివలింగాలు అభిషేకాలతో తడిసి ముద్దయ్యాయి. మహాశివరాత్రిని పురస్కరించుకుని శివున్ని దర్శించుకు నేందుకు ఆలయాలకు వేలాధిగా భక్తులు తరలిరావడంతో ఆలయాలన్ని కిట కిటలాడాయి. మరోవైపు శివరాత్రి సందర్భంగా ఉపవాస దీక్షలు చేపట్టిన భక్తులు సాయంత్రం వేళ శివున్ని దర్శించుకుని ఫలహారాలు దీక్షలను విరమించారు.

**భూకైలాస్‌కు పోటెత్తిన భక్తులు..**

మరోవైపు తాండూరు మండలం అంతారం తాండాలో వెలసిన భూకైలాస్ ద్వాదశ జ్యోతిర్లింగాల దేవస్థానంకు భక్తులు పెద్ద సంఖ్యలో పోటెత్తారు. దేవాలయ వ్యవస్థాపకులు, రాష్ట్రపతి అవార్డు గ్రహీత శంకర్ నాయక్ పవార్, వాసు నాయక్ పవార్‌ల ఆధ్వర్యంలో బ్రహ్మోత్సవాలు బ్రహ్మాండగా నిర్వహించారు. మహా శివరాత్రి సందర్భంగా దేవాలయంలో ప్రసిద్ధి గాంచిన నీటి గుండం ద్వారా భక్తులకు దర్శన భాగ్యం కల్పించారు. దేవాలయానికి వచ్చిన భక్తులు నీటిగుండం ద్వారా శివలింగాలకు అభిషేకాలు చేస్తూ దేవాలయంలోని మహా శివున్ని దర్శించుకున్నారు. అనంతరం దేవాలయ ప్రాంగణంలో వెలసిన పలు దేవతామూర్తులను దర్శించుకుని సల్లంగా చూడూ శివయ్య అంటూ వేడుకున్నారు. మరోవైపు శంకర్ నాయక్ పవార్, వాసు నాయక్ పవార్‌ల ఆధ్వర్యంలో దేవాలయంలో ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. భూకైలాస్‌లో జరిగిన బ్రహ్మోత్సవాలకు తాండూరుతో పాటు కర్ణాటక, , హైదరాబాద్, మహబూబ్‌నగర్, ఇతర జిల్లాల కు చెందిన భక్తులు ఎత్తున పోటెత్తడంతో భూకైలా స్‌లో బ్రహ్మోత్సవాల సంతరించుకుంది.అనంతరం ఆలయ అర్చకులు వేదమంత్రాలు పఠిస్తూ తీర్థప్రసాదాలు అందజేశారు.

# దిగ్విజయంగా...శ్రీ బాలాజీ నర్సింగ్ హోమ్ 20వసంతాలు

- ప్రతి మంగళవారం ఉచిత వైద్యసేవలు
- బివిజి ఫౌండేషన్ వ్యవస్థాపకులు డాక్టర్ సంపత్ కుమార్



**తాండూరు ఫిబ్రవరి 15 (జనంసాక్షి):** పట్టణంలోని శ్రీ బాలాజీ నర్సింగ్ హోమ్ దిగ్విజయంగా 20 వసంతాలు పూర్తి అయిందని బి వి జి ఫౌండేషన్ వ్యవస్థాపకులు డాక్టర్ సంపత్ కుమార్ తెలిపారు.తాండూరు పట్టణం డిసిఎంఎస్ ఎదురుగా ఉన్న శ్రీ బాలాజీ నర్సింగ్ హోమ్ 19వ తేదినాటికి 20 వసంతాలు పూర్తి అవుతుంది. ఫిబ్రవరి 19, 2006న అప్పటి మంత్రులు రోశయ్య, సబిత ఇంద్రారెడ్డి, స్థానిక ఎమ్మెల్యే నారాయణ మహారాజ్, మున్సిపల్ చైర్మన్ లక్ష్మారెడ్డిల చేతుల మీదుగా ప్రారంభించారు. పీబ్రవరి 19,2026 సంవత్సరానికి గాను 20 వసంతాల సందర్భంగా ఆసుపత్రికి వచ్చే రోగులకు ప్రత్యేక మినాయింపు కల్పించారు.ఈ సందర్భం ఓగా డాక్టర్ సంపత్ కుమార్ మాట్లాడుతూ ఈ నెల19 నుండి 31 వరకు ఆసుపత్రికి వచ్చే నార్మల్ డెలివరి 7వేలు.సిజేరియన్ డెలివరి 15వేలు మాత్రమేనని ప్రకటించారు.ల్యాబ్ పరీక్షలు మరియు మందులు అదనంగా తీసుకోవాలని సూచించారు.సీనియర్ స్త్రీ వైద్య నిపుణులు, ప్రసూతి, గర్భకోశ వ్యాధులు మరియు సంతాన సాఫల్య (ఐవిఎఫ్) నిపుణులు ఆసుపత్రిలో ప్రతి రోజు ఉజయం 10 నుండి రాత్రి 8 గంటల వరకు అందుబాటులో ఉంటారు. ప్రతి మంగళవారం ఆసుపత్రి వైద్యులు ఉచిత చికిత్సలు నిర్వహిస్తారు.శ్రీ బాలాజీ నర్సింగ్ హోమ్ 20వ వార్షికోత్సవం సందర్భంగా నియోజకవర్గ ప్రజలకు శుభాకాంక్షలు తెలిపారు.

## రాజేంద్రనగర్ నియోజకవర్గంలో

# మహాశివరాత్రి వేడుకలు ఘనంగా ప్రారంభం



**రాజేంద్రనగర్, ఫిబ్రవరి15 (జనంసాక్షి):** రాజేంద్రనగర్ నియోజకవర్గంలో మహాశివరాత్రి వేడుకలు భక్తిశ్రద్ధల మధ్య ఘనంగా ప్రారంభమయ్యాయి. అత్తాపూర్‌లోని అనంతగిరి శివాలయంలో ప్రత్యేక పూజలతో ఉత్సవాలు ఆరంభమయ్యాయి.రాజేంద్రనగర్ వెంకటేశ్వర స్వామి దేవాలయం హరి హర క్షేత్రంలో ఏకాదశ రుద్రాభిషేకం, శివపురాణ పారాయణం, హనుమాన్ చాలీసా పఠనం నిర్వహించారు. శివపార్వతుల ఉత్సవమూర్తుల ఊరేగింపు, లింగోద్భవ దర్శనం, పార్వతీ పరమేశ్వరుల కళ్యాణోత్సవం అంగరంగ వైభవంగా జరిగింది.ఈ దైవ కార్యక్రమంలో రంగారెడ్డి జిల్లా ప్రధాన కార్యదర్శి వై. శ్రీధర్, ఎస్ఏ మోర్చా ప్రధాన కార్యదర్శి ఇ. వేణుగోపాల్ స్థానిక బిజెపి నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు. నార్సింగి సర్కిల్ పరిధిలోని మంచిరేవుల మచిలేశ్వర స్వామి ఆలయంలో శనివారం నుంచి బ్రహ్మోత్సవాలు ప్రారంభమయ్యాయి. ఆదివారం ఉదయం షట్కాల పూజ, రుద్రాభిషేకం, పార్వతీ పరమేశ్వరుల కళ్యాణం, లింగోద్భవ దర్శనం నిర్వహించారు. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని స్వామివారిని దర్శించుకుని అభిషేకాలు, ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా నియోజకవర్గ బీజేపీ ఇంచార్జ్, కార్పొరేటర్ తోకల శ్రీనివాస్ రెడ్డి స్వామివారికి అభిషేకం నిర్వహించారు. మహాశివరాత్రి సందర్భంగా నియోజకవర్గంలోని పలు దేవాలయాలు భక్తులతో కిక్కిరిసిపోయాయి.

# శివ నామస్మరణతో మారుమోగిన ఆలయాలు

## భక్తులతో కిటకిటలాడిన శివాలయాలు



**శామీర్ పేట, (జనంసాక్షి):** శివనామస్మరణతో ఆలయాలు మారుమోగాయి. ఆదివారం ఉమ్మడి శామీర్ పేట మండలంలోని శివాలయాలు భక్తులతో కిటకిటలాడాయి. ఉదయం నుంచి సాయంత్రం వరకు భక్తులు స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలను నిర్వహించారు. శామీర్ పేట మండలం, మూడు చింతలపల్లి మండలం లోని శివాలయాలు భక్తు లతో రద్దీగా కనిపించాయి. మండల కేంద్రం శామీర్ పేట శ్రీభవాణిరామలింగేశ్వరస్వామి ఆలయంలో ప్రధానర్చకులు గడియారం మురళిధరశర్మ ఆధ్వర్యంలో ఐదుగురు వేదబ్రహ్మణుల మంత్రో చరణల మధ్య స్వామివారికి ఉదయం నుంచి ఏకాదశ రుద్రాభిషేకం చేశారు. అనంతరం స్వామివారి అలంకరణ, మంగళహారతి, మంత్ర పుష్పం, తీర్థప్రసాదం వితరణ చేశారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు భక్తుల గోత్రనామాలతో అర్చనలు చేశారు. ఆలయం వద్ద ఉదయం నుంచి రాత్రి వరకు పోలీసు బందోబస్తు చేపట్టారు. సాయంత్రం 4 గంటల నుంచి భక్తులు పెద్ద ఎత్తున స్వామివారి దర్శించుకుని ఉపవాస దీక్షలను విరమించారు. రాత్రి 8 గంటలకు శ్రీ భవాణిరామ లింగేశ్వర స్వామి కళ్యాణం భక్తుల కోలాహలం మధ్య నిర్వహించారు. రాత్రి జవహర్ నగర్ కు చెందిన సదాచారి భజన బృందం భజనలు చేయగా భక్తులు జాగరణ చేశారు. ఉమ్మడి శామీర్ పేట మండలంలోని తుర్కపల్లి, అలియాబాద్, లాల్ గడి మలక్ పేట, పొన్నాల్, బొమ్మరాశిపేట, తూంకుంట, దేవరయాంజాల్, తూంకుంటలోని శ్రీగాయత్రి మహాక్షేత్రంలోని ఉమామహేశ్వరస్వామికి ఆలయ వ్యస్థాపకులు డాక్టర్ ఎస్విఎల్ఎన్ మూర్తి ఆధ్వర్యంలో శివరాత్రి పర్వదినాన్ని ఘనంగా నిర్వహించారు. మూడు చింతలపల్లి మండలం లోని లక్ష్మాపూర్, మూడు చింతలపల్లి, ఉద్దమర్రి, కేశవరం, కొల్తూర్ లతోపాటు ఆయా గ్రామాలలో మహాశి వరాత్రి వేడుకలు అంగరంగ వైభవంగా జరుపుకున్నారు. ఉమ్మడి శామీర్ పేట మండలంలోని వివిధ గ్రామాలలో మహా శివరాత్రి పర్వదినం పురస్కరించుకుని ఉపవాస దీక్ష చేపట్టి ఉదయం నుంచి ఆలయాలకు భక్తులు పెద్ద సంఖ్యలో తరలి వెల్లి స్వామివారికి అభిషేకాలు, అర్చనలు చేశారు. సాయంత్రం శివయ్యను విరమించారు. భక్తులు పెద్ద ఎత్తున ఆయా గ్రామాలలో ఆలయాల వద్ద బారులు తీరి స్వామివారికి ప్రత్యేక పూజలు చేశారు. మహాశివరాత్రి సందర్భంగా జాగరణలో భాగంగా భక్తులు భజనలు చేశారు.ఈ కార్యక్రమం లో మాజీ ఎంపీపీ చంద్ర శేఖర్ యాదవ్, భక్తులు పాల్గొన్నారు.

# భక్తిశ్రద్ధలతో మహాశివరాత్రి వేడుకలు కిక్కిరిసిన ఆలయాలు



**పండగపూట సామాన్యులకు షాక్ ఇచ్చిన పండ్ల ధరలు**

**బొంరాస్ పేట, (జనంసాక్షి):** మండల పరిధిలోని నాగిరెడ్డిపల్లి పరమేశ్వరుడి గుట్టపై రాతి గుండుపై వెలసిన శివుడి సన్నిధితో పాటు, హైదరాబాద్ బీజాపూర్ 163 వ జాతీయ రహదారి పెద్ద చెరువు శివారులో వెలసిన పురాతన సంగమేశ్వర ఆలయానికి మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకొని భక్తులు భారీగా తరలి రావడంతో ఆలయాలు కిక్కిరిసిపోయాయి. పరమశివుడిని దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు.ఈ సందర్భంగా పూజారులు భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు.ఉపవాస దీక్షలు చేపట్టిన భక్తులు స్వామివారి సన్నిధిలో దీక్షలు విరమించారు. మహాశివరాత్రి సందర్భంగా పండ్ల ధరలు ఆకాశాన్నంటాయి. ఉపవాస దీక్షలను దృష్టిలో ఉంచుకొని డిమాండ్ పెరగడంతో వ్యాపారులు అమాంతం రేట్లను పెంచేశారు. మార్కెట్లో అరటి పండ్లు డజను రూ.80 వరకు,ద్రాక్ష కేజీ రూ.250, పుచ్చకాయ కేజీ రూ.50,ఖర్జూర ప్యాకెట్ రూ.60 చొప్పున ధర పలికింది.పండగపూట సామాన్యులు పండ్లు కొనలేక ఇబ్బందులు పడ్డారు.



# ఘనంగా శ్రీ సేవాలాల్ మహారాజ్ జయంతి వేడుకలు



**మోమిన్ పేట (జనంసాక్షి):** బంజారాల ఆరాధ్య దైవం సంత్ శ్రీ సేవాలాల్ మహారాజ్ జి 287వ జయంతి ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా నిర్వహించిన జయంతి కార్యక్రమానికి ముఖ్య నాయకులు లచ్చా నాయక్ తండ సర్పంచ్ చౌహాన్ లక్ష్మి రాజు ఈజ్రా చిట్టెంపల్లి సర్పంచ్ వందన విజయ్‌లు మాట్లాడుతూ హిందూధర్మం గొప్పతనం తెలియజేయ డానికి జన్మించిన మహానుభావుడు శ్రీ సంత్ సేవాలాల్ మహారాజ్ జయంతి సందర్భంగా ఆ మహాత్ముడికి శతకోటి వందనాలు సమర్పించడం జరిగింది. ఈ కార్యక్రమంలో రాళ్లగుడుపల్లి సర్పంచ్ మైపాల్ మక్త తాండసర్పంచ్ వర్త్య జాగ్యనాయక్ మాజీ సర్పంచులు నాయక్ మోతిలాల్ గోపాల్ నాయక్ గిరీష్ సింగ్ కాశీరాం మండల బిఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు డి వెంకట్ అప్సర్ షరీఫ్ అబ్బాస్ రవీందర్ ఆర్ విజయ గణపతి రాజు కాశీనాథ్ చరణ్ సింగ్ వివిధ గ్రామాల తాండ వాసులు అధిక సంఖ్యలో పాల్గొనడం జరిగింది.